క్లుప్తంగా

పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా బండి రవి



భానుపురి : ఆలేరులో జరిగిన పీవైఎల్ ఐక్యత సభలో సూర్యాపేట జిల్లాకు చెందిన బండి రవి పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతీ, యువకులను విస్మరిస్తూ వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించడంలో వైఫల్యం చెందాయన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని అన్నారు.

'సంపదను దోచుకోవడం కోసమే ఎన్‌కౌంటర్లు'

నూతనకల్ : అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడమే లక్ష్యంగా ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేసోజు మధు అన్నారు. శుక్రవారం నూతనకల్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో జీడీపీ ఆరు శాతం మాత్రమే ఉందని, దీన్ని పెంచడానికి చర్యలు చేపట్టాల్సిన పాలకులు నక్సలైట్లను ఎరివేయడంలో శ్రద్ధ వహిస్తున్నారని ఆయన విమర్శించారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి, దోషులను శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు మున్నా అశోక్, మధు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు అన్యాయం

నాగారం : ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో నిజమైన అర్హులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు కుంభం కరుణాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామ సభలలో అధికారులు ప్రకటిస్తున్న జాబితాలలో నిజమైన లబ్ధిదారుల పేర్లు లేకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు భాషబోయిన యాదగిరి, కన్నెబోయిన అంజయ్య, నీలం లింగయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పథకాల్లో సవరణ చేయాలి



నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన కార్మికులు

భానుపురి : కేంద్ర విద్యుత్ బస్సుల పథకాల్లో సవరణలు చేసి నిధులు, సబ్సిడీలు ఇవ్వాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ డిపో కార్యదర్శి రవికుమార్ అన్నారు. విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి ఉప్పు లక్ష్మయ్య, నాయకులు శ్రీకంఠం, శ్రీనివాస్ రెడ్డి, సత్తయ్య, యాదగిరి, ప్రకాష్, ప్రవీణ్, ఉప్పలమ్మ, లోకేశ్వరి, రజిత, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.


పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో పీఆర్‌టీయూ డైరీ–2025ని మండల విద్యాధికారి బోయిని లింగయ్య శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం తహసీల్దార్ దయానందం, ఎంపీడీఓ శేషుకుమార్, ఎంపీఓ సందీప్‌లకు డైరీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గుజ్జ భాస్కర్, మండల శాఖ అధ్యక్షులు పాటి సుధీర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్, శ్రీరాములు, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ

సూర్యాపేట : జర్నలిస్టులు స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని డీఎస్పీ రవి అన్నారు. శుక్రవారం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ తృతీయ వార్షికోత్సవంలో భాగంగా సీతారాంపురంలోని ఎంపి పాఠశాలలో 9వ తరగతి, 10వ తరగతికి చెందిన 100మంది విద్యార్థులకు ఉచితంగా ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేసే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి యాదగిరి, ప్రధానోపాధ్యాయుడు యాకయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దూపాటి శ్యాంబాబు, ఉపాధ్యక్షుడు లింగంపల్లి నాగబాబు, ప్రధాన కార్యదర్శి గౌసుద్దీన్, దుర్గం బాలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహబూబా ఉర్సు



పెన్‌పహాడ్ : దూపహాడ్‌లో గంధంను ఎత్తుకొస్తున్న నిర్వాహకులు



పెన్‌పహాడ్ : మహబూబా దర్గా వద్ద పోటెత్తిన భక్తులు

పెన్‌పహాడ్ : దూపహాడ్‌లో మహబూబా ఉర్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. పాలకవీడు మండలం జాన్‌పహాడ్ నుంచి గంధం తీసుకొచ్చి ఊరేగింపు నిర్వహించి దర్గాలోకి తీసుకొచ్చారు. దట్టీలు, పూలు తీసుకొచ్చి మహబూబా సమాధిని చాందినిలతో అందంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముజావరి సైదా దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాహితాలు ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. నాగులమ్మ పుట్ట వద్ద కూడా పూజలు నిర్వహించారు. దర్గా వద్ద ఏర్పాటు చేసిన కవాలి పలువురిని ఆకట్టుకుంది. ఉత్సవాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ గోపికృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, గోపగాని సందీప్, గోపగాని లక్ష్మమ్మ, హుస్సేన్, గుర్వయ్య, సైదులు, లక్ష్మీనారాయణ, దొంగరి సైదులు, అడ్డి కేశవులు, పిన్నాని సందీప్, భూక్య సందీప్‌రాథోడ్, బిట్టు భాస్కర్, వీరభద్రం, సోమేశ్వర్ రావు, జనార్దన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చిన్నదర్గా ఉర్సు ప్రారంభం

అర్వపల్లి : అర్వపల్లి శివారులోని హజ్రత్‌ఖాజా నసీరుద్దీన్‌బాబా దర్గా సమీపంలోని సయ్యద్ జాన్‌పాక్ షహీద్‌ఖాజా మోహినుద్దీన్‌బాబా దర్గా (చిన్నదర్గా) ఉర్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ఉత్సవాల్లో భాగంగా దర్గా ధర్మకర్త వెన్న శ్రీకాంత్ రెడ్డి, నిఖిల్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, దర్గా ముజావరి, హబీబ్‌రెహమాన్‌లు పెద్ద దర్గా నుంచి గంధం పాత్రలు, దట్టీలను ఎత్తుకొని చిన్నదర్గా వరకు ఊరేగింపుగా వచ్చి చిన్నదర్గా చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం చిన్నదర్గాలో బాబా సమాధులకు చాదర్, పూలదండలను సమర్పించారు. అలాగే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదే విధంగా జలాలిబాబా, జహంగీర్‌బాబా సమాధులపై కూడా చాదర్‌లు ఉంచారు. గంధం ఊరేగింపునకు ముందు ఫకీర్‌లు చువ్వలు పొడుచుకుంటూ జరబ్ నిర్వహించారు. ఉర్సుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో నాగారం మండల విద్యుత్ ఏఈ మహేందర్‌నాథ్, ఫజల్, ముజీబ్, జానీ, నోమాన్, రబ్బాని, బషీర్, సయ్యద్ అంజద్, రమేష్, మల్లిఖార్జున్, సంపత్, కర్నాని రమేష్, భక్తులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ : నాగులమ్మ పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



అర్వపల్లి : గంధంను ఊరేగింపుగా తీసుకెళ్తున్న నిర్వాహకులు

ఫ్లైఓవర్ నిర్మించవద్దని ఎమ్మెల్యేకు వినతి



రామన్నగూడెంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అర్వపల్లి గ్రామస్తులు

అర్వపల్లి : అర్వపల్లి వై జంక్షన్ నందు ఫ్లై ఓవర్ నిర్మాణం జరగకుండా చూడాలని కోరుతూ శుక్రవారం రామన్నగూడెంలో ఎమ్మెల్యే సామేల్‌కు స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. అర్వపల్లిలో ఫ్లైఓవర్ నిర్మించడం వల్ల 200 కుటుంబాలు వీధిన పడతాయని చెప్పారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, గుడిపల్లి మధుకర్‌రెడ్డి, బైరబోయిన మహరాజు, సైదులు, బైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్, అల్వాల వెంకటస్వామి, దావుల లింగయ్య, సతీష్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన



సూర్యాపేటటౌన్ : మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ



ఆత్మకూర్ (ఎస్) : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళాబృందం

సూర్యాపేటటౌన్ : రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం అవగాహన కల్పించారు. హైవేలపై తిరిగే వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తే చర్యలు తప్పవన్నారు. హైవేలపై ఓవర్ లోడింగ్‌తో వెళ్తే వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు.

డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

ఆత్మకూర్ (ఎస్) : సైబర్ నేరాలు, డ్రగ్స్, గంజాయి, రోడ్డు ప్రమాదా నివారణపై శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ పాఠశాలలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడారు. సైబర్ మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. బ్యాంక్ ఖాతా, ఆధార్‌కార్డు వివరాలు ఎవరికీ ఇవ్వొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వీరారెడ్డి, కస్తూరిబా గాంధీ పాఠశాల ఎస్ఓ సరస్వతి, ఎంవీఎఫ్ మండల ఇన్‌చార్జ్ లలిత, పోలీస్ కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, కృష్ణ, చారి, గురులింగం, నాగార్జున పాల్గొన్నారు.

దరఖాస్తులు నిరంతరం స్వీకరిస్తాం

- జెడ్పీ సీఈఓ, డీఆర్‌డీఓ అప్పారావు



అల్లునూరులో అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు

నూతనకల్ : అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని జెడ్పీ సీఈఓ, డీఆర్‌డీఓ అప్పారావు స్పష్టం చేశారు. శుక్రవారం నూతనకల్ మండల పరిధిలోని అల్లునూరు గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు రాలేదని ఆందోళన చెందొద్దని, దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతులు సన్న వడ్లకు ప్రభుత్వం చెల్లించే బోనస్ విషయమై డీఆర్‌డీఓను నిలదీశారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో సన్న ధాన్యాన్ని విక్రయించినప్పటికీ బోనస్ తమ ఖాతాల్లో పడలేదని రైతులు డీఆర్‌డీఓను ప్రశ్నించారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకొని సకాలంలో బోనస్ చెల్లించే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. తాళ్లసింగారం, యడవెల్లి, ఎర్రపహాడ్, కొత్తతండా, సోమ్లాతండా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి పాల్గొని ప్రభుత్వ పనితీరును వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీత, వ్యవసాయ అధికారి మురళి, ఏపీఓ శ్రీరాములు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న దాత

పెన్‌పహాడ్ : పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు దాతలు సహకారం అందించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు పిండిగ నర్సయ్య అన్నారు. శుక్రవారం దోసపహాడ్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన కొండేటి రామానుజమ్మ– లింగారెడ్డిల జ్ఞాపకార్థం కుమారుడు, మాజీ ఉప సర్పంచ్ కొండేటి జానకిరెడ్డి రూ. 10వేల విలువ చేసే క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మామిడి వెంకటయ్య, ఉపాధ్యాయులు రాయికింది వెంకటేశ్వర్లు, ఎక్కులూరి విజయకుమారి, ఎరుకుల వెంకన్న, గద్దల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రైతుభరోసా ప్రారంభం

నాగారం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే రైతు భరోసా పథకం రేపటి నుంచి ప్రారంభమవుతుందని నాగారం మండల వ్యవసాయ అధికారి కృష్ణకాంత్ తెలిపారు. శుక్రవారం నాగారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుభరోసా పథకం కింద ప్రతి అర్హుడైన రైతుకు సంవత్సరానికి రూ.12,000 పెట్టుబడి సాయం అందుతుందని తెలపారు. 2025 జనవరి 1వ తేదీ వరకు కొత్త పట్టా పాస్ బుక్ ఉన్నవారు ఈ పథకానికి అర్హులని, నూతన అప్లికేషన్లను అర్హులైన వారు వారి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారికి అప్లికేషన్ సమర్పించాలని కోరారు. అలాగే అప్లికేషన్‌తో పాటు పట్టా పాస్ బుక్ ప్రతులు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు అందించాలని తెలిపారు. రైతు భరోసా పథకంపై ఏవైనా సందేహాలు ఉంటే సమీప వ్యవసాయ విస్తరణ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఇప్పటికే రైతుబంధు పథకం లబ్ధిదారులుగా ఉన్న రైతులు ఈ పథకానికి కొత్తగా అప్లికేషన్ పెట్టుకోవాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

విద్యాసంస్థల్లో రాజ్యాంగ పీఠిక చదివించాలి



పోస్టుకార్డులను చూపుతున్న డీఎస్పీ నాయకులు

నాగారం : విద్యాసంస్థల్లో భారత రాజ్యాంగ పీఠికను ప్రతిరోజు ప్రార్థన సమయంలో చదివించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకుడు పేరాల శ్రీనివాస్ మహరాజ్ అన్నారు. లక్ష పోస్టు కార్డుల ఉద్యమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డికి ఉత్తరాలను పంపించే కార్యక్రమం చేపట్టారు. భారత గణతంత్ర దినోత్సవం రోజున జాతీయ జెండాల వద్ద భారత రాజ్యాంగ గ్రంథాన్ని, దాని రూపశిల్పి డాక్టర్ అంబేద్కర్ చిత్రపటాన్ని ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు పేరాల పెద్ద శ్రీనివాస్, పేరాల సునీత, పేరాల వీరేష్, ఇరుగు సతీష్, కంచనపల్లి దిలీప్, వర్ధం నరసింహ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐలో చేరిక

భానుపురి : సీపీఐలో వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు చేరడం అభినందనీయమని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, పట్టణ సీనియర్ కార్యవర్గ సభ్యుడు దంతాల రాంబాబు అన్నారు. శుక్రవారం పట్టణ నూతన సభ్యత్వాల చేరికలో భాగంగా పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దేశగాని హేమలత, రెడీమల శ్రీనివాస్‌లు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యవర్గ సభ్యులు బొమ్మగాని శ్రీనివాస్, చామల అశోక్ కుమార్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదు పరిశీలన

అర్వపల్లి : ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ఆన్‌లైన్ ప్రక్రియను శుక్రవారం స్థానిక ఉపాధిహామీ పథకం కార్యాలయంలో డీఆర్‌డీఓ అప్పారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలు దొర్లకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో టీఏ యాదమ్మ, సీఓ సుధీర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నారాయణమూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్లు సుజాత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సిబ్బందికి సన్మానం



మున్సిపల్ సిబ్బందికి భోజనం వడ్డిస్తున్న కౌన్సిలర్ వల్దాస్ సౌమ్యజాని

సూర్యాపేటటౌన్ : 23వ వార్డుకు చెందిన మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య, ఇతర సిబ్బందిని ఆ వార్డు కౌన్సిలర్ వల్దాస్ సౌమ్యజాని శుక్రవారం సన్మానించారు. రాజీవ్‌నగర్ బతుకమ్మ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిబ్బందిని సన్మానించి దుస్తులు అందజేశారు. వారితో కలిసి భోజనం చేశారు. ఐదేళ్ల పాలనలో తనకు మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య, ఇతర సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సహకరించారని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



అర్వపల్లి : రామన్నగూడెం గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్



సూర్యాపేట : 36వ వార్డులో దరఖాస్తులు స్వీకరిస్తున్న కౌన్సిలర్ ప్రవళిక



తిరుమలగిరి : 13వ వార్డు సభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

సూర్యాపేట : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందని కౌన్సిలర్ వెలుగు వెంకన్న అన్నారు. శుక్రవారం 48వ వార్డులో ఏర్పాటు చేసిన వార్డు సభ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాపర్తి నాగరాజు, బొమ్మిడి అశోక్, ఆర్పి మంత్రాల పద్మ, మున్సిపల్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

36వ వార్డులో..

సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూర్యాపేట పట్టణ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, 36వ వార్డు కౌన్సిలర్ గండూరి ప్రవళిక ప్రకాష్ అన్నారు. శుక్రవారం 36వ వార్డులో ఏర్పాటు చేసిన వార్డు సభలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్ రావు, వార్డు అధికారులు సంతోష్ రెడ్డి, జీవన్, మల్లేష్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బూర సతీష్ పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించేందుకే..

అర్హులకు పథకాలు అందించేందుకే ప్రభుత్వం వార్డు సభలు నిర్వహిస్తోందని మున్సిపల్ ఈఈ కిరణ్ అన్నారు. శుక్రవారం 45వ వార్డులో ఏర్పాటు చేసిన వార్డు సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గండూరి కృపాకర్, వార్డు అధికారి ఉపేంద్రచారి పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలలో భాగంగా..

అర్వపల్లి : ఆరు గ్యారంటీలలో భాగంగా ప్రభుత్వం ప్రస్తుతం ఒకేసారి నాలుగు పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. రామన్నగూడెంలో జరిగిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. గత 10ఏళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనులను ఏడాదిలో కాంగ్రెస్ పార్టీ చేసి తీరిందని చెప్పారు. ఈ సభలో కాంగ్రెస్ వర్గీయుల మధ్య తోపులాట చోటు చేసుకోగా పోలీసులు ఎక్కడి వారిని అక్కడ చెదరగొట్టారు. అలాగే జాజిరెడ్డిగూడెం, అర్వపల్లి గ్రామాల్లో కూడా గ్రామసభలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఎంపీఓ గోపి పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : నాలుగు రోజులుగా నిర్వహించిన గ్రామసభలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపురోజు మండలంలోని ఏపూరు, ఆత్మకూరు, రామోజీతండా, ముక్కుడుదేవులపల్లి, ఏపూర్ తండా, పాతర్ల పహాడ్, మిడతనపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, తహసీల్దార్ హరిశ్చంద్ర ప్రసాద్, ఎంపీడీఓ హసీమ్, ఎంఈఓ ధారాసింగ్, అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ పథకాలు

తిరుమలగిరి : ప్రజాపాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. గ్రామ సభలలో చెప్పిన జాబితాలో కొంత మంది పేర్లు నమోదు కాలేదని, అర్హులైన ప్రతి ఒక్కరూ మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సమావేశంలో కందుకూరి కుమారస్వామి, గోపాల్ దాస్ రాజు, తిరుమలేష్, సోమయ్య, లక్ష్మయ్య, కుమార్, విష్ణు, సంతోష్, వెంకటేష్ పాల్గొన్నారు.

13వ వార్డు సభ

తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో శుక్రవారం వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లలో తమ పేర్లు నమోదు కాలేదని అధికారులను నిలదీశారు.

నాగారం : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని తహసీల్దార్ బ్రహ్మయ్య అన్నారు. శుక్రవారం డి.కొత్తపల్లి, వర్ధమానుకోట, పస్తాల గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలలో పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామసభలలో అర్హుల జాబితా వెల్లడించి, నూతనంగా ఆయా పథకాల కోసం దరఖాస్తులను, అభ్యంతరాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.మారయ్య, ఏఓ కృష్ణకాంత్, డీటీ షాహిన్‌బేగం, ఎంపీఎస్ఓ చింతమల్ల రమేష్, ఏపీఓ రవి, ఏపీఎం శోభారాణి, ఏఈఓ సాయిరాజ్, పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మద్దిరాల : అర్హులకే ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎంపీఓ ఇబ్రహీం అన్నారు. శుక్రవారం జి.కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కన్న సురాంభ వీరన్నగౌడ్, మాజీ సర్పంచ్ బొబ్బిలి నర్సమ్మ, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బొబ్బిలి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీహెచ్. సంతోష్‌కుమార్ అన్నారు. శుక్రవారం వాల్యతండా, జయరాంగుడితండా, సేవాలాల్‌తండా గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో మాట్లాడారు. జాబితాలో పేర్లు రాని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంల తహసీల్దార్ క్రిష్ణయ్య, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తహసీల్దార్ లాలు అన్నారు. శుక్రవారం గాజులమల్కాపురం, నాగులపాటి అన్నారం గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో మాట్లాడారు. నాగులపాటి అన్నారం, చీదెళ్ల, అనాజీపురం, భక్తాళాపురం గ్రామాల్లో అర్హుల జాబితాల్లో పేర్లు రాని వారు అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంపీఓ సంజీవయ్య, ఏఓ అనిల్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను అడ్డుకున్న ప్రజలు

తుంగతుర్తి : మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే మందుల సామేల్‌కు నిరసన సెగ తగిలింది. గ్రామసభకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడబోతుండగా మొదటగా లబ్ధిదారుల పేర్లు చదివిన తర్వాతనే మాట్లాడాలని గ్రామస్తులు పట్టుబట్టారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా ఘర్షణ వాతావరణం నెలకొంది. అయినప్పటికీ ఎమ్మెల్యే మాట్లాడుతుండగా పలువురు రైతులు తమకు రైతు రుణమాఫీ కాలేదని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ప్రభుత్వ పథకాలు ఏవీ పారదర్శకంగా అమలుకావడం లేదని మహిళలు గొంతు ఎత్తారు. తమకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేస్తుండగా గ్రామస్తులు ఆగ్రహించి ఎమ్మెల్యే డౌన్.. డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో ఎమ్మెల్యే అర్ధాంతరంగా సమావేశం నుంచి వెళ్లిపోతుండగా ఎమ్మెల్యే గోబ్యాక్ అంటూ గ్రామస్తులు నినాదాలు చేశారు. పోలీసులు ఎమ్మెల్యే కాన్వాయ్ బయటికి వెళ్లడానికి మార్గం సుగమం చేశారు. అనంతరం అధికారులు ప్రజలకు సమాధానం చెప్పలేక పోలీసుల సహకారంతో గ్రామసభను ముగించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, తహసీల్దార్ దయానంద్, ఎంపీడీఓ శేషుకుమార్, ఇన్‌చార్జ్ ఏడీ బాలక్రిష్ణ, ఏఈఓ, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

మద్దిరాల : మండల పరిధిలోని పోలుమల్లలో టీడీపీ రాష్ట్ర నాయకుడు ఆకారపు రమేష్, జిల్లా నాయకుడు దండెంపల్లి నరేష్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్వాయి బాలయ్య, రమేష్, చామకూరి శ్రీనివాస్, సతీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

కోడూరులో డ్రై డే

అర్వపల్లి : కోడూరు గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రై డేగా పాటించారు. వైద్య సిబ్బంది ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కుంభం వీరయ్య, ఏఎన్ఎం విజయశాంతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

అర్వపల్లి : అడివెంల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జాల రామనర్సయ్య ఇటీవల మృతి చెందారు. దీంతో శుక్రవారం ఎమ్మెల్యే సామేల్ మృతుడి కుటుంబీకులను పరామర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో డీసీసీబీ మాజీ చైర్మన్ బీరవోలు సోమిరెడ్డి, జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అర్వపల్లి : అడివెంల గ్రామానికి చెందిన జాల రామనర్సయ్య ఇటీవల మృతి చెందారు. దీంతో గ్రామానికి చెందిన రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ, మాజీ సర్పంచ్ మడ్డి పద్మ శుక్రవారం మృతుడి కుటుంబీకులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఎస్‌కే లతీఫ్, పేరెల్లి ఉప్పలయ్య పాల్గొన్నారు.